సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

7

సోమవారం । 27 । జనవరి । 2025


ప్రథమస్థానం సాధించిన కొయ్యూరు విద్యార్థుల మల్లకంబ ప్రదర్శన


తృతీయ స్థానంలో నిలిచిన ఉప్ప ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

న్యూస్‌రీల్

ఘనంగా అల్లూరి విగ్రహావిష్కరణ


జడేరులో అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరించిన సినీనటుడు గౌతమ్‌రాజు

గంగవరం: మండలంలోని జడేరులో ఆదివారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని సినీనటుడు భూపతిరాజు గౌతమ్‌రాజు ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి పోరాటం చిరస్మరణీయని, ఆయన జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అల్లూరి పోరాటం జరిపిన మన్యంలోని చారిత్రక ప్రాంతాలను అభివృద్ధి చేసి నేటి తరాలకు చూపించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. అల్లూరి యువజన సంఘం సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సీలేరు డ్యామ్ గేట్ల పరిశీలన


డ్యామ్ గేట్లను పరిశీలిస్తున్న పీఈఎస్ కంపెనీ బృందం

సీలేరు: స్థానిక జల విద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్ డ్యామ్ గేట్లను హైదరాబాద్ కు చెందిన పీఈఎస్ కంపెనీ నిపుణుల బృందం ఆదివారం పరిశీలించింది. 1968లో నిర్మించిన ఈ డ్యామ్ గేట్లు అత్యవసర సమయంలో దిగువకు దిగకుండా మొరాయిస్తున్నాయి. దీని వల్ల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసినప్పుడు చింతపల్లి క్యాంపు వద్ద గల ఎంబాక్‌మెంట్‌పై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల పరిసర గ్రామ గిరిజనులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయాన్ని స్థానిక అధికారులు జెన్‌కో హైడల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సీలేరు రెగ్యులేటర్ డ్యాం గేట్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని పీఈఎస్ కంపెనీ నిపుణుల బృందాన్ని ఆయన ఆదేశించారు. ఈ మేరకు బృందం సభ్యులు స్థానిక జెన్‌కో ఈఈ శ్రీనివాసరెడ్డితో కలిసి రెగ్యులేటర్ డ్యామ్ గేట్లను నిశితంగా పరిశీలించారు.

126 కిలోల గంజాయి పట్టివేత

- ఆరుగురి అరెస్టు


గంజాయి, నిందితులతో పోలీసులు

మోతుగూడెం: వాహన తనిఖీల్లో భాగంగా ఆదివారం మోతుగూడెం వద్ద 126 కిలోల గంజాయిని తరలిస్తున్న ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శివన్నారాయణ తెలిపారు. జీకే వీధి మండలం పెదగొంది నుంచి తెలంగాణలోని పెద్దపల్లి గ్రామానికి ఈ గంజాయిని రవాణా చేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఏఎస్‌ఐ రాజేశ్వర్రావు, హెచ్‌సీలు కొండబాబు, పురోషోత్తం, పీసీ సన్యాసిరావు పాల్గొన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


జాతీయ జెండాను ఎగురవేస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు


గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

సమగ్ర గిరిజనాభివృద్ధికి కృషి

- డోలీ మోతలు రహిత మన్యమే లక్ష్యం
- రోడ్లు, తాగునీటికి అధిక ప్రాధాన్యం
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- ఘనంగా గణతంత్ర వేడుకలు

సాక్షి,పాడేరు: స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో జిల్లాలో గిరిజనుల సమగ్ర అభివృద్ధికి అన్నిశాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. 76వ భారత గణతంత్ర దినోత్సవాన్ని స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మైదానంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ 2047తో బంగారు ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అన్ని రంగాల్లో 15 శాతం జీడీపీ వృద్ధి లక్ష్యంతో ఉన్నామని ఆయన పేర్కొన్నారు. డోలీ రహిత మన్యం లక్ష్యంతో రూ.300 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రూ.350కోట్లతో ఉపాధి హామీ పనులు, రూ.630 కోట్లతో తాగునీటి పథకాలు, రూ.20.11 కోట్లతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ఉద్యానవన, వ్యవసాయశాఖ, కాఫీ సాగు రంగాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పీఎం జన్‌మన్ పథకంలో 17,111 గృహాలు, స్కిల్ డవలప్‌మెంట్‌లో 836 మంది గిరిజన నిరుద్యోగులకు శిక్షణ, 607 మందికి


కలెక్టర్ కార్యాలయం వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ

ఉద్యోగాలు కల్పన చేపట్టామని కలెక్టర్ తెలిపారు. విద్య వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో సెల్‌టవర్ల నిర్మాణాలతో పాటు గుంతలు లేని రోడ్లకు చర్యలు తీసుకున్నామన్నారు. పాడేరులో వైద్య కళాశాల పెండింగ్ పనులతోపాటు జాతీయ రహదారుల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. గంజాయి రహిత మన్యానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్, జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ,


ఆకట్టుకున్న పోలీసు డాగ్ విన్యాసం


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్

ఏఎస్పీ అడ్మిన్ ధీరజ్, ఏఎస్పీ అపరేషన్స్ జగదీష్, పాడేరు సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఏజెన్సీలోని పాడేరుతో పాటు పలు ప్రాంతాలకు చెందిన 25 పాఠశాలల విద్యార్థులతోపాటు పాడేరు వైద్య కళాశాల విద్యార్థులు పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కొయ్యూరు బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మల్లకంబ విద్య ప్రదర్శన ప్రథమస్థానం, పాడేరు గౌతమి పాఠశాల విద్యార్థుల నృత్యప్రదర్శన ద్వితీయ స్థానం, హుకుంపేట మండలం ఉప్ప గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన తృతీయ స్థానం సాధించాయి.

వ్యవసాయ శకటానికి ప్రథమ బహుమతి

ప్రభుత్వ పథకాలకు సంబంధించి శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శకటానికి ప్రథమ స్థానం లభించింది.స్త్రీశిశు సంక్షేమశాఖ శకటానికి ద్వితీయ స్థానం, ఆర్‌అండ్‌బీ, గిరిజన సంక్షేమం.పంచాయతీరాజ్‌శాఖ శకటానికి తృతీయ స్థానం లభించింది.

మెరిసిన కాఫీ బోర్డు స్టాల్

అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటిని కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ.ఇతర అధికారులంతా పరిశీలించారు.


తలారిసింగి మైదానంలో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్, జేసీ అభిషేక్‌గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్

కాఫీబోర్డు స్టాల్‌కు ప్రథమ స్థానం, ఉద్యానవనశాఖ ద్వితీయ స్థానం, అటవీశాఖ స్టాల్‌కు తృతీయ స్థానం లభించాయి. అటవీశాఖ పలు రకాల పాముల ప్రదర్శన మరింత ఆకట్టుకుంది. విద్యార్థులకు బహుమతులు, ఉత్తమ అధికారులకు పురస్కారాలను కలెక్టర్ అందజేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి: పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు: ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రతిఒక్కరు కృషి చేయాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. ఆదివారం గణతంత్ర వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. మోదమాంబ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తి కలిగి ఉండాలి: ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ టౌన్: ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండటమే కాకుండా భారత రాజ్యాంగాన్ని గౌరవించి బాధ్యతగా నడుచుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. మండలంలోని కంఠభౌంసుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో ఆయన మాట్లాడారు.


ద్వితీయ స్థానం సాధించిన గౌతమి పాఠశాల విద్యార్థుల ప్రదర్శన


ఆకట్టుకున్న అటవీశాఖ పాముల ప్రదర్శన



ద్వితీయ స్థానం సాధించిన స్త్రీశిశు సంక్షేమశాఖ శకటం


ప్రథమ స్థానం సాధించిన వ్యవసాయశాఖ శకటం

చర్మవ్యాధి సోకిన చిన్నారులకు సత్వర వైద్యం


లండూలు గ్రామంలో చర్మవ్యాధి సోకిన చిన్నారులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా


అంబులెన్సులో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా
- లండూలు, పెద్దపాడు, గొచ్చంగి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహణ

పెదబయలు: చర్మవ్యాధి సోకిన చిన్నారులకు సత్వర వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. ఆదివారం మండలంలోని గిన్నెలకోట పంచాయతీ పరిధి లండూలు, పెద్దపాడు, గొచ్చంగి గ్రామాల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చర్మవ్యాధి సోకిన రెండు నుంచి పదేళ్ల చిన్నారులను వైద్య నిపుణులు పరిశీలించారు. వారి నుంచి రక్తనమూనాలు సేకరించారు. గ్రామాల్లో పరిసరాలు, నివాసిత ప్రాంతాలను సందర్శించారు. తల్లీబిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారా లేదా అనే అంశంపై ఆరా తీశారు. ఈ శిబిరానికి ఆధ్వర్యం వహించిన డీఎంహెచ్‌వో జమాల్‌బాషా మాట్లాడుతూ చర్మవ్యాధి ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో మాత్రమే ప్రబలుతుందన్నారు. మందులు, సిరప్‌లు పంపిణీ చేశారు.

15 మంది చిన్నారులను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు

దద్దుర్లు, జ్వరం, దగ్గు, ముక్కు నుంచి నీరు కారడం లక్షణాలు ఉన్న 15 మంది చిన్నారులను గోమంగి, రూడకోట, లబ్బూరు పీహెచ్‌సీలకు చెందిన అంబులెన్సుల్లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించామని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తెలిపారు. మీజిల్స్ వ్యాధి కావొచ్చన్న అనుమానంతో తరలించినట్టు ఆయన పేర్కొన్నారు. వీరికి సత్వర వైద్యం అందిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణారావు, ఎస్‌పీఎం ప్రొఫెసర్, మైక్రో బయాలజీ ప్రొఫెసర్, పిల్లల వైద్యనిపుణులు, రూడకోట, గోమంగి వైద్యాధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు


అంతర్లలో కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినా చలి, మంచు తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. దీంతో మన్యం వాసులు వణికిపోతున్నారు. ఆదివారం జి.మాడుగులలో అత్యల్పంగా 8.3 డిగ్రీలు నమోదు అయినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని గూడెంకొత్తవీధిలో 8.6, పాడేరులో 8.9, చింతపల్లిలో 9.0, పెదబయలులో 9.0, అరకువ్యాలీలో 9.3, డుంబ్రిగుడలో 9.6, హుకుంపేటలో 9.9, ముంచంగిపుట్టులో 11.4 , అనంతగిరిలో 13.6, కొయ్యూరులో 14.5 డిగ్రీలు నమోదు అయినట్టు ఆయన పేర్కొన్నారు. పగటి వేళలో వాతావరణంలో మార్పు వల్ల ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ఉంటుందని ఆయన వివరించారు.

పర్యాటకుల సందడి

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగికి పర్యాటకులు తాకిడి కొనసాగుతోంది. ప్రకృతి సోయగాలను, మంచు అందాలను తిలకించడానికి కుటుంబసమేతంగా తరలివస్తున్నారు. ఇక్కడికి సమీపంలో చెరువులవేనం వ్యూపాయింట్‌కు ఆదివారం అధిక సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. ప్రకృతి అందాలను తిలకిస్తూ మురిసిపోయారు. ఫొటోలు, సెల్ఫీలు దిగారు. తాజంగి జలాశయం వద్ద పర్యాటకులు సందడి చేశారు.


ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ


అవగాహన ర్యాలీలో హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్న ఎస్పీ అమిత్ బర్దర్

- ఎస్పీ అమిత్ బర్దర్
- పాడేరులో అవగాహన ర్యాలీ

పాడేరు: ద్విచక్ర వాహనదారుల తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ అమిత్‌బర్దర్ సూచించారు. జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో ఆదివారం హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరి ప్రాణం వారు కాపాడుకునేందుకు నాణ్యమైన హెల్మెట్లు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ దీనబంధు పాల్గొన్నారు.

నేడు గంగమ్మతల్లి జాతర


ఆలయం వద్ద సందడి చేస్తున్న బుడియాలు

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ పేటమాలిపుట్టులో వెలసిన గంగమ్మతల్లి జాతర మహోత్సవాలు ఈనెల 27 సోమవారం నుంచి జరగనున్నాయి. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ పండగను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళవారం ఉదయం నుంచి మొక్కుబడులు నిర్వహించనున్నారు. వారం రోజులుగా బుడియాలు విస్తృత ప్రచారం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఉత్సవకమిటీ తెలిపింది.

ఆకట్టుకుంటున్న రోబో

రూపొందించిన డీఏవీ పాఠశాల విద్యార్థులకు అభినందన

సీలేరు: స్థానిక డీఏవీ (ఏపీజెన్‌కో) పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సాయి రమాకాంత్, నవీన్ కుమార్ పాత్రో రూపొందించిన రోబో ఎంతగానో ఆకట్టుకుంటోంది. రాబోయే కాలంలో రోబోల ద్వారా విద్యను అందించవచ్చు అనే ఉద్దేశంతో దీనిని రూపొందించామని వారు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్‌కుమార్, ఎల్‌ఎంసీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ శ్రీనివాస్ రెడ్డి ,డీఈ రాజేంద్రప్రసాద్ ,ఏడీఈ దుర్గా శ్రీనివాస్, సురేష్, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ ఇద్దరు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులు రూపొందించిన రోబోతో జెన్‌కో అధికారులు, ప్రిన్సిపాల్ తదితరులు

స్వాతంత్య్ర సమరయోధుల వారసులకు సత్కారం



గీసిన చిత్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందజేస్తున్న డ్రాయింగ్


అరకు కాఫీ స్టాల్ వద్ద కాఫీ తాగుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్


సమరయోధుల వారసులను సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్,

సాక్షి, పాడేరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం స్వాతంత్య్ర సమరయోధుల వారసులను తలారిసింగి మైదానంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ శాలువాలు కప్పి సత్కరించారు. అరకు కాఫీ స్టాల్‌ను సందర్శించిన కలెక్టర్, ఎస్పీలు కాఫీ రుచి చూశారు. పలువురు డ్రాయింగ్ టీచర్లు గీసిన చిత్రాన్ని డీఈవో బ్రహ్మాజీరావు సమక్షంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందజేశారు.

క్లుప్తంగా

13 ఏళ్ల బాలికపై హాకీ క్రీడాకారుడు లైంగికదాడి

• తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలికపై సీనియర్ హాకీ క్రీడాకారుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. పట్టణంలోని ఉలకోపేటకు చెందిన యువకుడు మళ్ల రూపేష్ హాకీ క్రీడాకారుడు. రాజీవ్ క్రీడా మైదానంలో హాకీ సాధన కోసం వస్తున్న వస్తున్న 13 ఏళ్ల బాలికతో పరిచయాన్ని ఆసరాగా చేసుకుని మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ దారుణానికి సంబంధించి బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం పోక్సో కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.సావిత్రి ఆదివారం రాత్రి మీడియాకు తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపి, 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాద, శేషవస్త్రాలను అందజేశారు.అనంతరం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవ మూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శంకర్ ఫౌండేషన్‌కు సేవా పురస్కారం

సింహాచలం: 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డీజీఎం కె.బంగార్రాజు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

యలమంచిలి రూరల్ : మండలంలోని షేకిళ్ల పాలెం సమీపంలో కోడి పందేల శిబిరంపై ఆదివారం యలమంచిలి రూరల్ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఇక్కడ గ్రామ శివార్లలో కోడి పందాలు నిర్వహిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించగా కోడి పుంజులకు కత్తులు కట్టి, నగదు బెట్టింగ్‌గా ఉంచి పందేలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. శిబిరం వద్ద నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రెండు కోడి పుంజులు, రూ.250 నగదు స్వాధీనపర్చుకున్నట్టు పోలీసులు తెలిపారు.




ఉత్తమ సేవలకు పురస్కారం : కలెక్టర్ దినేష్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, ఎస్పీ అమిత్‌బర్దర్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఏఎస్పీ జగదీష్, పాడేరు సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, పాడేరు డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, పాడేరు డీఆర్వో పద్మలత, పాడేరు ఇన్‌చార్జి డీడీ రజని, పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, టీడబ్ల్యూ అరకు ఈఈ వేణుగోపాల్, టీడబ్ల్యూ చింతూరు ఈఈ మురళి, పాడేరు ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు, పాడేరు కాఫీ ఏడీ అప్పలనాయుడు, ట్రైకార్ రికవరీ అధికారి సీతారామ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రోహిణి, జీసీసీ పాడేరు జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, అరకు డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి. చలపతిరావు, డుంబ్రిగుడ కేజీబీవీ సీఆర్‌టీ కంబిడి కృష్ణకుమారి, స్పైసెస్ బోర్డు విస్తరణ అధికారి కల్యాణి, ముంచంగిపుట్టు వైద్యాధికారిణి శిరీష, కూనవరం ఎంపీడీవో రామాంజనేయప్రసాద్, రాజవొమ్మంగి తహసీల్దార్ సత్యనారాయణ.

సాక్షి,పాడేరు: జిల్లాలో విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన జిల్లా,డివిజన్, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు 316 మందికి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఉత్తమ పురస్కార సేవా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్దర్, ఏఎస్పీ అడ్మిన్ ధీరజ్, ఓఎస్‌డీ జగదీష్, జేసీ అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి అందరూ కృషి చేయాలి



ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



అవార్డు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ జిలానీ



అవార్డు స్వీకరిస్తున్న ఎంపీడీవో తూతిక శ్రీనివాస్



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రంపచోడవరం: దేశాభివృద్ధికి అందరూ కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తెలిపారు. రిపబ్లిక్‌డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జాతీయ జెండాను పీవో ఎగురువేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, డీఎస్పీ సాయి ప్రశాంత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా చేపట్టిన ప్రగతిని వివరించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని పీవో, సబ్ కలెక్టర్, డీఎస్పీలు స్వీకరించారు. ఏజెన్సీలో వివిధ కార్యాలయాలకు చెందిన 104 మందికి ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ,పీవో, సబ్ కలెక్టర్, డీఎస్పీలు అందజేశారు. మార్చ్‌పాస్ట్‌లో 12 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా మొదటి బహుమతి ఇర్లపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలకు, రెండో బహుమతి ముసురుమిల్లి పాఠశాలకు, మూడో బహుమతి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల బాలురకు లభించాయి. 17 పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా మొదటి బహుమతి దామనపల్లి ఆశ్రమ పాఠశాలకు, రెండో బహుమతి రంపచోడవరం ఆశ్రమ పాఠశాల బాలురకు,



చింతూరులో విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

మూడో బహుమతి ముసురుమిల్లి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలకు లభించాయి. ఈ కార్యక్రమంలో డీడీ ఎ.విజయశాంతి, ఏపీవో జనరల్ డి.ఎస్.వి.రమణ, ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, కుంజం వంశీ, ఈఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద...

రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఏఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ సాయి ప్రశాంత్, డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ వసుధ జాతీయ జెండాను ఎగురవేశారు.

గిరిజనాభివృద్ధే లక్ష్యం

చింతూరు: గిరిజనాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో జెండాను ఎగురవేశారు. అనంతరం గురుకుల పాఠశాల మైదానంలో జరిగిన పరేడ్‌లో పాల్గొన్న ఆయన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల నుంచిగౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ చింతూరు డివిజన్లో 4,771 మంది రైతులకు 17,550 ఎకరాలకు పోడు పట్టాలు మంజూరు చేసినట్టు తెలిపారు. పేదలకు సకాలంలో వైద్యం అందేలా ఆస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగు పరిచామని, నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పీవో తెలిపారు. రక్తహీనతతో బాధతో పడుతున్న తల్లులు, బిడ్డలు, గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నామని, జల్‌జీవన్ మిషన్ కింద వ్యక్తిగత ఆవాసాలకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విధుల్లో ప్రతిభ కనబరచిన వివిధ శాఖల ఉద్యోగులకు ఆయన ప్రశంసా పత్రాలను అందజేశారు.



పాడేరు ఐటీడీఏ వద్ద జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న పీవో అభిషేక్

పాడేరు: సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ గత 50 ఏళ్ల నుంచి గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పాడేరు ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. అనంతరం ఐటీడీఏలో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు, వి.ఎస్. ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, ఐటీడీఏ పరిపాలన అధికారి హేమలత, డీఆర్డీఏ పీడీ మురళి, డీడీ రజినీ, జిల్లా వైద్యాధికారి జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం



అమ్మవారి ఉత్సవంలో యువకుల సందడి



స్టేజ్‌పై డ్యాన్స్ బేబీ డ్యాన్స్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవం శనివారం రాత్రి ఘనంగా ముగిసింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుమారుగా 3 లక్షల మంది శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ ఉత్సవాన్ని తిలకించారు. గవరపాలెం సంతోషిమాత ఆర్చ్ పక్కన మందుగుండు సీతారామయ్య కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బాణసంచాను జనసేన నియోజకవర్గ నాయకుడు భీమరశెట్టి రాంకీ వెలిగించారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఎం.శ్రావణి, పట్టణ సీఐ విజయకుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణలు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూకమహాలక్ష్మీనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

చోడవరం : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు రెండో రోజు ఆదివారం ఎంతో ఉత్కంఠగా జరిగాయి. పోటీలను చూసేందుకు వచ్చిన క్రీడాభిమానులతో అంకుపాలెంలో క్రీడా ప్రాంగణం కిక్కిరిసింది. ఈ గ్రామంలో దుర్గాంబిక అమ్మవారి పండగను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి మహిళ, జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. 13 జిల్లాల నుంచి 913 మహిళా జట్లు పోటీ పడుతున్నాయి. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వీరలంకయ్య, రిఫరీస్ బోర్డు చైర్మన్ బాలు, జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో చివరి రోజు సోమవారం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి.

రెండో రోజు తలపడ్డ మహిళా జట్లు

కర్నూలు జట్టుపై పశ్చిమగోదావరి, చిత్తూరు జట్టుపై నెల్లూరు జట్టు విజయం సాధించాయి. అనంతపురంపై కృష్ణా జిల్లా, కడపపై శ్రీకాకుళం, ప్రకాశంపై తూర్పుగోదావరి జట్టు గెలుపొందాయి. పశ్చిమగోదావరిపై చిత్తూరు, నెల్లూరు జట్టుపై కర్నూలు , చిత్తూరు జట్టుపై కృష్ణా జట్లు గెలుపొందాయి. కడపపై విజయనగరం జట్టు, ప్రకాశంపై శ్రీకాకుళం, కడపపై తూర్పుగోదావరి, అనంతపురంపై కృష్ణా, గుంటూరుపై విజయనగరం జట్లు విజయం సాధించాయి. కర్నూలుపై నెల్లూరు, ప్రకాశంపై చిత్తూరు, గుంటూరుపై విశాఖపట్నం జట్టు గెలుపొందాయి.



తలపడుతున్న మహిళా జట్లు

ముగిసిన గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవాలు

• ఆకట్టుకున్న అన్నదాత నాటిక ప్రదర్శన
• విజేతలకు బహుమతులు, ఆదర్శ రైతులకు సత్కారం



అన్నదాతలోని సన్నివేశం

మునగపాక: స్థానిక గౌతమపఠన మందిర స్వర్ణోత్సవాలు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాత నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కళాంజలి హైదరాబాద్ వారు ప్రదర్శించిన నాటికకు విల్లూరి శివప్రసాద్ రచన అందించగా కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. నటీనటులు మెరుగైన ప్రతిభ కనపరిచారు. స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఆదర్శ రైతులకు సత్కారం నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ బహుమతులు అందజేశారు.



ఆదర్శ రైతు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కళాకారులను, రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏటా గౌతమ పఠన మందిరం అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి సుధారాణి, మారిశెట్టి అప్పారావు, దాడి సూరిబాబు, దాడి అప్పలనాయుడు, శ్రీరామమూర్తి, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, బూడిద రామారావు, వెలగా శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు సోమవారం జరగనుంది. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.జ్ఞానవేణి తెలిపారు. బీచ్ రిసార్టులు, అడ్వెంచర్, క్రూయిజ్ టూరిజం, ఎకో టూరిజం, అరకు కాఫీ, 2024-29 పర్యాటక పాలసీ తదితర అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా జిల్లాలో టూరిజం శాఖకు సంబంధించి 15 ల్యాండ్ పాకెట్స్ ఉన్నాయని.. టర్నోవర్‌ను బట్టి ఆసక్తి గల సంస్థలకు భూ కేటాయింపులు జరుగుతాయని.. ఈ అంశంపైనా సదస్సులో చర్చించనున్నామన్నారు. దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగస్వామ్యం కానున్న ఈ సదస్సును పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించనున్నారని తెలిపారు. సమ్మిట్‌కు ఏపీటీడీసీ చైర్మన్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులు హాజరుకానున్నారని వెల్లడించారు.

పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్ల పరిశీలన

మురళీనగర్(విశాఖ) : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్లను తిరుపతి ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఎ.నిర్మల్ కుమార్ ప్రియ ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన కాలేజీని సందర్శించి ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, ఇతర సిబ్బందితో చర్చించారు. పోటీల్లో తలపడాల్సిన టీమ్‌లకు సంబంధించి లాటరీని తీసి ప్రకటించారు. అనంతరం క్రీడా మైదానాన్ని పరిశీలించి ట్రాక్ అండ్ ఫీల్డ్‌ల మార్కింగ్‌లపై పలు సూచనలు చేశారు. స్టేజీ ఏర్పాట్లతోపాటు క్రీడాకారుల వసతి కల్పనకు ఎంపిక చేసిన భవనాలు, వాటి గదుల్లోని సౌకర్యాలను పరిశీలించారు. డిప్యూటీ సెక్రటరీ కె.లక్ష్మిపతి, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు, కో-కన్వీనర్ డాక్టర్ బి.జానకీరామ్, హెచ్‌వోడీలు కేడీవీ నరసింహారావు, కె.మధుకుమార్, డాక్టర్ రత్నకుమార్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ

రంగోత్సవంలో మెరిసిన గురుకుల విద్యార్థులు

• ముంబైలో జరిగిన పోటీల్లో 8 మందికి స్వర్ణ పతకాలు
• ఐదుగురు విద్యార్థులకు రజత పతకాలు
• అభినందించిన ప్రిన్సిపాల్ రఘు

దేవరాపల్లి : జాతీయ స్థాయి రంగోత్సవ సెలబ్రేషన్స్, చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్‌లో మండలంలోని తెనుగుపూడి బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల ముంబైలో జరిగిన జాతీయ చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్‌లో గురుకులం విద్యార్థులు 8 స్వర్ణపతకాలు, ఐదుగురు రజత పతకాలు సాధించారు. స్థానిక గురుకుల విద్యాలయానికి చెందిన కె.సుధీర్, బి.సంజయ్, ఎం.జయశంకర్, ఎల్.ఆకర్ష్, వి.అఖిల్, ఎ.నవీన్‌కుమార్, పి.చిన్నారావు, పి.జశ్వంత్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారు. కె.మదన్, వై.నరేంద్ర, జి. జశ్వంత్, ఎం.రాజేష్, ఎం.తేజ సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఆర్ట్ టీచర్ జి.అర్జునరావును ఆదివారం స్థానిక గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ పి.రఘు, ఉపాధ్యాయులు, మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను అభినందించారు. ప్రశంసా పత్రాలతో సత్కరించారు.



ఆర్ట్ కాంపిటేషన్‌లో సత్తా చాటిన తెనుగుపూడి గురుకుల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘు తదితరులు